ప్రశాంతి ఎన్‌క్లేవ్‌లో 'అశాంతి' జీవనం..!

మురుగు నీటితో
సతమతమవుతున్న కాలనీవాసులు
పట్టించుకోని బడంగ్‌పేట్
మునిసిపల్ అధికారులు
హైడ్రా సూచనలూ బేఖాతరు

సరూర్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 29వ డివిజన్‌లోని ప్రశాంతి ఎన్‌క్లేవ్ కాలనీవాసులు నిత్యం 'అశాంతి' జీవనం సాగిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా కాలనీలో దుర్గంధం వెదజల్లుతోంది. నివాస గృహాల మధ్య నుంచి పారుతున్న మురుగు స్థానికులకు నరకం చూపిస్తోంది. ఎగువ కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మొత్తం ఈ కాలనీలో నిలిచిపోతుండడంతో ఇక్కడ మురుగు నీరు నదిలా ప్రవహిస్తోంది. మునిసిపల్ అధికారులు సరైన ప్రణాళిక లేకుండా ఎగువ కాలనీల్లో నిర్మించిన డ్రైనేజీ లైన్ కారణంగా ప్రశాంతి ఎన్‌క్లేవ్ కాలనీ సదరు డ్రైనేజీ లైన్‌కు అవుట్‌లెట్‌గా మారిపోయింది. గతంలో అధికారులు చేపట్టిన వరదనీటి కాలువ నిర్మాణం సైతం అడ్డదిడ్డంగా ఉండడంతో వర్షం వచ్చినప్పుడు ఇక్కడ పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. వర్షం నీరు, మురుగు నీరు కలిసి కాలనీని ముంచేస్తున్నాయి.


కాలనీలో ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న మురుగు నీరు



వర్షం కురిసినప్పుడు మురుగు నీటితో నిండిన కాలనీ (ఫైల్ ఫొటో)

అధికారుల్లో చలనం కరువు

తమ సమస్యను మునిసిపల్ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వరద నీటి కాలువతో పాటు డ్రైనేజీ లైన్‌ను సైతం సరైన పద్ధతిలో నిర్మిస్తే తమ సమస్య పరిష్కారమవుతుందని వారంటున్నారు. అయితే అధికారులు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

హైడ్రా సూచనలు పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులు తమ సమస్యను పట్టించుకోక పోవడంతో స్థానికులు ఈ విషయాన్ని సెప్టెంబరు 23న హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు హైడ్రా అధికారుల బృందం కాలనీలో పర్యటించి పరిస్థితిని అధ్యయనం చేసింది. ఈ మేరకు ఎగువ కాలనీలకు సంబంధించిన వరద నీటి కాలువ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని గుర్తించిన హైడ్రా బృందం.. వెంటనే సదరు లైన్లను సరిచేసి ప్రశాంతి ఎన్‌క్లేవ్‌లోని సమస్యను పరిష్కరించాలని సూచిస్తూ అక్టోబరు 7న బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులకు లేఖ రాసింది. బాక్స్ డ్రెయిన్‌గానీ, ఓపెన్ నాలాగానీ నిర్మించాలని సదరు లేఖలో సూచించింది. అయినా మునిసిపల్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్య పారుతున్న మురుగుతో నరకం అనుభవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు మా గోడు పట్టించుకోండి



ఇళ్ల మధ్య పారుతున్న మురుగుతో కాలనీ అంతా దుర్గంధం వ్యాపిస్తోంది. మునిసిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో హైడ్రాను ఆశ్రయించాం. అక్కడి అధికారులు పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులకు లేఖ రాశారు. మేం కూడా అక్టోబరు 8న మరో వినతి పత్రం అందజేశాం. నేటికీ అధికారులు కాలనీని సందర్శించ లేదు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు.

- సతీశ్‌రెడ్డి, ప్రశాంతి ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

చలానా విధించి, సెల్‌ఫోన్ లాక్కున్నాడని యువకుడి దౌర్జన్యం


దాడికి పాల్పడిన భరత్

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన యువకున్ని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. భరత్ అనే యువకుడు ఈ నెల 26న ఎల్‌బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అయితే డ్రైవింగ్ చేస్తున్న భరత్ హెల్మెట్ ధరించకపోవడంతో కొత్తపేట చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ అప్పారావు బైక్‌ను ఆపాడు. హెల్మెట్ ధరించకపోవడం ట్రాఫిక్ ఉల్లంఘన కింద వస్తుందని చలానా విధించాడు. బైక్ తాళాలు, సెల్‌ఫోన్ తీసుకోవడంతో కొద్ది సేపు వారిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వెళ్లిపోయిన భరత్ 15 నిమిషాల తర్వాత తిరిగి వచ్చి కానిస్టేబుల్‌పై దాడికి దిగాడు. రాయితో దాడి చేసి, కానిస్టేబుల్ చేతిలో ఉన్న టాబ్లెట్‌ను ధ్వంసం చేశాడు. దాడి చేసి వెళ్లిపోతున్న భరత్‌ను అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్, స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రసాయన పొల్యూషన్ పరిష్కారానికి కృషి : సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డు ద్వారా వచ్చే వ్యర్థ రసాయనాల పొల్యూషన్‌ను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డంపింగ్‌యార్డు సమీపంలో గల మన్సూరాబాద్, నాగోల్ డివిజన్‌లోని పది కాలనీల జేఏసీ అధ్యక్షుడు కత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డంపింగ్‌యార్డునుంచి వచ్చే పొల్యూషన్‌తో జేఏసీలోని సెవెన్‌హిల్స్ కాలనీ, స్వాతిగార్డెన్స్, ద్వారకానగర్, డీపీనగర్, హిమపురికాలనీ ఫేజ్1,2, సహారా స్టేట్స్‌కాలనీ, జడ్జెస్‌కాలనీ, సౌత్‌ఎండ్‌పార్క్, చండీశ్వర్ నగర్, ప్రెస్ కాలనీలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్‌యార్డుకు సమీపంలోని పలురసాయన కంపెనీలకు చెందిన షెడ్లు, గోడౌన్ల స్థితిగతులు పరిశీలించి వాటి ద్వారా వచ్చే పొల్యూషన్ నియంత్రిస్తామన్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేసేలా నిరంతరం నిఘా ఉండే లా చూస్తామన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వైదేహినగర్‌లో పార్కును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గణేష్ రెడ్డి

కాలనీల అభివృద్ధికి మధుయాష్కీ కృషి: గణేష్ రెడ్డి

వనస్థలిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మధుయాష్కీగౌడ్ కృషి చేస్తున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గణేష్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ రోడ్డు నం.12లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ సహకారంతో మంజూరైన నిధులతో అభివృద్ధి చేసిన పార్కును ఆదివారం కాలనీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డితో కలిసి గణేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, శివరాం ప్రసాద్, నర్సింహ్మారెడ్డి, జంగారెడ్డి, మినేశ్వర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.


సాయిరామ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్

లింగోజిగూడ అభివృద్ధే లక్ష్యం : రాజశేఖర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లింగోజిగూడను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని సాయిరామ్‌నగర్‌కాలనీలో రూ.38 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. కాలనీలలో రహదారులపై చెత్త వేయకుండా చూడటంతో పాటు నీటిని వృథా చేయకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరి కిరణ్‌కుమార్, యువజన కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి, శర్మ, శ్రీనివాస్‌రావు, మాధవరావు, రాందేవ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గీతా గొప్పదనం గురించి వివరిస్తున్న జె.భవానీశంకర్

'గీతా పఠనంతోనే మనోధైర్యం, విజ్ఞానం'

మన్సూరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గీతా పారాయణం, పఠించి అందులోని భావాన్ని అర్థం చేసుకున్న వారికి మనోధైర్యం, విజ్ఞానం కలుగుతుందని రాష్ట్ర గవర్నర్ సంయుక్త కార్యదర్శి జె.భవానీశంకర్ అన్నారు. గీతా జయంతిని పురస్కరించుకుని వివేకానంద రాక్ మెమోరియల్, వివేకానంద కేంద్ర కన్యాకుమారి సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నాగోల్‌లోని కో ఆపరేటివ్‌బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాలులో విద్యార్థులకు గీతలోని 7వ అధ్యాయంపై పఠన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా భవానీశంకర్, గీతా వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రొఫెసర్ బి.నాగేశ్వర్‌సింగ్ విచ్చేశారు. వారు మాట్లాడుతూ జీవితంలో ఎలాంటి ప్రయాణం మొదలు పెట్టినా ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతోందని, గీతా పారాయణం, పఠించే వారి ప్రతి అడుగు విజయతీరాలకు చేర్చుతోందన్నారు. ఇందులో భాగంగా అండర్-9, అండర్-15, బిట్వీన్ 15-25, అబో-25 నాలుగు విభాగాలలో కలిపి 169 మంది బాలబాలికలు, యువత పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభకనబర్చిన ముగ్గురుకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లను అందజేశారు.

'పంచాయతీ ఎన్నికల బరిలో సీపీఐ అభ్యర్థులు'

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు సీపీఐ నుంచి అభ్యర్థులు బరిలో ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సీపీఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలపర్చిన సర్పంచ్, వార్డు అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుడినే స్థానిక ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కమ్యూనిస్టుల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. డబ్బులకు ఓటును అమ్ముకోవద్దని, సరైనా నాయకుడికే పట్టం కట్టాలని కోరారు. అర్హులైనా ప్రతీ పేద వాడికి ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహా కార్యదర్శి నరసింహ కేతరాజు, రమేష్‌నాయక్, బిక్షపతి, నాగేశ్వరరావు, లక్ష్మణ్, నరసింహ, అన్నపూర్ణ, ప్రియా, చీరాల లక్ష్మి, వాసిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో రూ.5.12 కోట్ల పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, పక్కన కార్పొరేటర్ మిన్హాజుద్దీన్ తదితరులు

చాదర్‌ఘాట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అక్బర్‌బాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతా ల్లో రూ.5.12 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదివారం డివిజన్ కార్పొరేటర్ మిన్హాజుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. అక్బర్‌బాగ్‌లోని గీతారెసిడెన్సీ లేన్‌లో రూ.19.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ఆనంద్‌నగర్ పద్మావతి కాలనీ షాకా గ్రౌండ్ లేన్‌లో రూ.35లక్షలతో సీసీ రోడ్డు, బీ బ్లాక్స్‌లో వరద సమస్య నివారణకు రూ.49 లక్షలతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను, అమీన్ కాలనీలో పార్క్‌లో రూ.21.80 లక్షలతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, ప్రహరీ గోడను, హరిహర క్షేత్రం లేన్‌లో రూ.22 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, పల్టాన్‌లో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ప్రభుత్వ క్వార్టర్స్ లేన్‌లో రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అమీన్ కాలనీ న్యూ ఎరా స్కూల్ లేన్‌లో రూ.13లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ప్రభుత్వ క్వార్టర్స్ ఓల్డ్ గ్రౌండ్ లేన్‌లో రూ.15.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, సోహేల్ హోటల్ సమీపంలో రూ.19.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, ఇదే ప్రాంతంలో రూ.10.50లక్షలతో పునర్ నిర్మించిన వరద నీటి కాలువను, గచ్చిబౌలి బస్తీలో రూ.10లక్షలతో సీసీ రోడ్డును కాలాడేరలో రూ.6.40లక్షలతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను ఎమ్మెల్యే బలాల ప్రారంభించారు. అదేవిధంగా నల్గొండ చౌరస్తా నుంచి గవర్నమెంట్ ప్రెస్ వరకు రూ.90లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు మధ్యలో డివైడర్, గ్రీనరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అక్బర్‌బాగ్ అజయ్ టవర్ లేన్‌లో రూ.1.70 కోట్లతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్‌ను పల్టాన్ చౌరస్తా నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తా వరకు రూ.12లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అమీన్‌కాలనీ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ నిర్వహణకు రూ.12.80లక్షలు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈలు వెంకన్న, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కాలనీని అభివృద్ధి చేస్తా : కొప్పుల

మన్సూరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధి చేయడానికి కృషిచేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. రూ.15లక్షల వ్యయంతో అభివృద్ధిపర్చిన మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్‌కాలనీ ఓపెన్ గ్రౌండ్‌ను కాలనీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనరసింహ, సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి చేతుల మీదుగా ఆదివారం వేర్వేరుగా ప్రారంభించారు. అనంతరం గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న కొప్పుల మాట్లాడారు. నిర్లక్ష్యానికి గురైన కాస్మోపాలిటన్‌కాలనీలోని ఓపెన్ గ్రౌండ్ చుట్టూ ఫెన్సింగ్, గేట్లు ఇతర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు కొప్పులనుశాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా విజయనాథ్ గుప్తా

చంపాపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చంపాపేట ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఇడుకుల్ల విజయనాథ్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చంపాపేటలోని ఎస్వైఆర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో విజయనాథ్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్త ప్రకటించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌గుప్త మాట్లాడుతూ, చంపాపేటలో 15 ఏళ్లుగా సభ్యత్వాలు చేపట్టలేదని.. నూతన కార్యవర్గం సభ్యత్వాలను చేపట్టాలని సూచించారు. విజయనాథ్‌గుప్త మాట్లాడుతూ, త్వరలోనే పూర్తి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఈస్ట్ జోన్ చైర్మన్ కుంచారపు రాజగుప్త, తాజా మాజీ అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్త, మహేష్ గుప్త, లోకేష్‌గుప్త, విజయరాములు, శ్రీనివాస్‌గుప్త పాల్గొన్నారు.

'న్యాయవాదులకు కార్పొరేట్ వైద్యం అందించాలి'

చాదర్‌ఘాట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని న్యాయవాదులకు ప్రత్యేక భద్రతా చట్టంతోపాటు ఉచిత కార్పొరేట్ వైద్యసేవలు అమలు చేయాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఆదివారం గడ్డిఅన్నారంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 115 వివిధ కోర్టుల్లో దాదాపు 50వేల మంది నాయవాదులు సేవలందిస్తున్నారన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక భద్రత చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఆరోగ్య భద్రత లేకుండా పోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు హెల్త్ కార్డులున్నా పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.


గ్రూప్-1లో ఎంపికైన వారిని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో సన్మానిస్తున్న అతిథులు

13 మంది గ్రూప్-1 అధికారులకు సన్మానం

ఎల్‌బీనగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 అధికారులుగా బాధ్యతలు చేపట్టిన అధికారులు.. నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. గ్రూప్-1లో ఎంపికై ఉన్నత పదవులు చేపట్టిన 13 మంది అధికారులకు ఆదివారం వాసవీకాలనీలోని వాసవీ ఆధ్యాత్మిక కేంద్రంలో ది ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ ఆఫ్ ఇండియా, అష్టలక్ష్మీ దేవాలయం, తెలంగాణ స్టేట్ అవోపా, వైస్రాయ్ ఇండియా, అవోపాస్ హైదరాబాద్, అవోపాస్ బ్యాంకర్‌మెన్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యతలు స్వీకరించిన వారు యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త మాట్లాడుతూ, సమాజానికి మేలు చేయాలంటే చదువుతో పాటు రాజకీయాలలోకి ప్రవేశించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారిగా నియమితులైన దేవకి వాసుదేవరావును సన్మానించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు శ్రీధర్, అష్టలక్ష్మీ దేవాలయం చైర్మన్ సోమ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్, వేణు

కూలిన గోడ.. తప్పిన ప్రమాదం


దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని నేతాజీనగర్‌లోని రాపోలు నారాయణ ఇంటి మొదటి అంతస్తు గోడ కూలిన ఘటనలో ఓ కారు ధ్వంసమైంది. శనివారం రాత్రి సమయంలో ఇంట్లో అందరూ టీవీ చూస్తుండగా గోడ కూలింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో హాల్‌లో ఉన్న వారంతా ఆందోళనకు గురయ్యారు. అయితే మొదటి అంతస్తు గోడ కూలి ఇంటి ఆవరణలో పార్కు చేసిన వ్యాగన్ ఆర్ కారు మీద పడడంతో కారు, ఇంటి గేటు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంటి పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఆ శబ్దానికి చుట్టుపక్కల వారు ఒక్కసారిగా ఉలిక్కిపడి వీధిలోకి పరుగులు తీశారు. తెలుసుకున్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్, కె.శశిధర్‌రెడ్డి, తెలంగాణ జేఏసీ నాయకుడు రంగారెడ్డి ఆదివారం గోడను పరిశీలించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలు పొందిన విద్యార్థులతో అతిథులు

విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

చంపాపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అసోసియేట్ వైస్ చాన్సలర్ చంద్రమాదాసకా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్లు కష్టపడి చదివిన విద్యార్థులు ఇకపై ఉన్నత చదువులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి తల్లిదండ్రుల కలలను నేరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాసు, కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్, వీరన్న, కాంతలం, కుమార్‌కేశ్మోని, రాధాకృష్ణ, చిరంజీవి, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాధాదేవి, రవికుమార్, మంగులాల్ తదితరులు పాల్గొన్నారు.

మనుషుల మధ్య దూరం వద్దు : ఆధ్యాత్మికవేత్త అజీజ్


మాట్లాడుతున్న మహ్మద్ అజీజ్

చాదర్‌ఘాట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మనుషుల మధ్య నెలకొన్న దూరాలను రూపుమాపి సోదరభావాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఖురాన్ తెలుగు అనువాదకర్త మహ్మద్ అజీజ్ ఉర్ రెహమాన్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ మలక్‌పేట శాఖ ఆధ్వర్యంలో ఆఫీసర్స్ మెస్‌లో ఆదివారం ఆదర్శ పొరుగు-ఆదర్శ సమాజం అనే అంశంపై సర్వమత సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో ఏళ్ల తరబడి ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నా ఒకరినొకరు గుర్తు పట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇరుగుపొరుగు ఒకరినొకరు రక్షణ కవచంలా ఉండాలని ఆయన సూచించారు. ప్రైవసీ పేరుతో కన్న తల్లిదండ్రులతో కూడా దూరాలు పెంచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సలీమ్ అహ్మద్ ఖాన్, స్థానిక జమాత్ అధ్యక్షుడు ముజీబుల్ అలా, ఆర్య సమాజ్ ప్రతినిధి విఠల్‌రావు, వివిధ సంస్థల ప్రతినిధులు దానకర్ణచారి, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి, న్యాయవాది సుభాషిణీ తసీర్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న వినయ్ పటేల్


పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ

వనస్థలిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు తమ వంతుగా సేవ చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐనాల వినయ్ పటేల్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కేడీనగర్‌లోని తన నివాసంలో జీహెచ్ఎంసీ కార్మికులకు వినయ్ పటేల్ ఆదివారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు తమ వంతుగా కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికుల శ్రేయస్సుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


అయ్యప్ప మహాపడిపూజలో గురుస్వామి పల్లె మహేష్‌గౌడ్, మాలధారులు

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజలు

మన్సూరాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నాగోల్ బండ్లగూడలోని యెగ్గె మల్లేశం గార్డెన్స్ ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి పల్లె మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అయ్యప్ప మాలధారులు అయ్యప్ప శరణుఘోశలు, భజన కీర్తనలతో టేకుమట్ల మురళి గురుస్వామి వేదమంత్రోచ్ఛరణల నడుమ శబరిగిరీశుడి నామాన్ని స్మరిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పరిసర ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అనంతరం అయ్యప్ప మాలధారులు, వారి కుటుంబ సభ్యులు, భక్తులకు అన్నప్రసాద వితరణ(బిక్ష) ఏర్పాటు చేశారు.


అయ్యప్ప పదునెట్టాంబడి పూజలో క్యామ మల్లేష్, రాంరెడ్డి తదితరులు

బాచారం గ్రామంలో..

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని బాచారం గ్రామంలో ఆదివారం గండిపల్లి వెంకటేష్, ఐలాగోని రాము గురుస్వామి ఆధ్వర్యంలో 18వ మహాపడి పూజ ఘనంగా జరిగింది. అయ్యప్ప నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్యామ మల్లేష్, దండెం రాంరెడ్డి పదునెట్టాంబడి పూజలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా : కార్పొరేటర్ కళ్లెం


షిర్డీనగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శివారు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన షిర్డీనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షిర్డీనగర్‌లో రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు పూర్తయిన ప్రాంతాలలో సీసీ రోడ్లు వేయడం జరుగుతుందన్నారు.

వనస్థలిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.